# బ్యూటీ స్పాట్



సింధూర చంద్రశేఖర్ గురించి ఇంట్లో చెప్పినప్పుడు తండ్రి ఎగిరిపడ్డాడు. ప్రేమలూ, దోమలూ తమ వంశంలోనే లేవన్నాడు. చదువు మాన్పించి ఇంట్లో ఉంచి తాళం వేస్తానన్నాడు. తల్లి బావిలో దూకి చస్తానంది. చెల్లెలు పావనీ ఒక్కతే మౌనంగా వుండిపోయింది. ప్రేమించిన యువకుడి గురించి ఓ ఆడపిల్ల ఇంట్లో చెప్పినప్పుడు తల్లిదండ్రులు చేసే ఫార్సంతా వాళ్ళూ చేశారు.

చివరికి సింధూరే గెల్చింది.

చంద్రశేఖర్ సద్గుణాలు, అతడి నాలుగంకెల ప్రభుత్వపు ఉద్యోగంకూడా వారి ఓటమికి ఓ కారణం. చంద్రశేఖర్‌కి సాంప్రదాయపు వివాహం మీద సదభిప్రాయం లేదు. వారిద్దరి వివాహం ఏ ఆర్భాటం లేకుండా జరిగింది. భర్తతో కల్సి సింధూర బెంగుళూరు వెళ్ళిపోయింది. ఇది జరిగిన రెండు సంవత్సరాల తర్వాత, పావనీ అక్కని చూడాలని మరీ మరీ వ్రాసిన మీదట సింధూర పుట్టింటికొచ్చింది.

మనిషి బాగా మారింది. శరీరచ్ఛాయ మెరుగుపడింది. చీరకట్టు అందంగా మారింది. స్లీవ్స్ పొట్టియిపోయాయి. తలమీద కట్టుకున్న కొప్పు ఎయిర్‌హోస్టెస్‌ని గుర్తుకు తెస్తుంది. వీటన్నింటినీ మించి ఎడమవైపు చెక్కిళిమీద పెట్టుకున్న కాటుకచుక్క ఆమె అందానికి పరాకాష్ఠ. రెండు రోజులపాటు అక్కా చెల్లెళ్ళిద్దరూ ఊరంతా తిరిగారు. చిన్ననాటి కబుర్లన్నీ చెప్పుకున్నారు. సాయంత్రం భోజనాల సమయంలో తండ్రి చిన్నకూతురి వివాహ ప్రస్తావన తెచ్చినప్పుడు పావనీ చాలా అనీజ్‌గా కదిలింది. సముద్రపు ఒడ్డున కట్టుకున్న ఇసుకగూడు మరెవరో నిర్దాక్షిణ్యంగా పాడుచేస్తున్నట్లు...

ఆ భావం సింధూర పసిగట్టింది. భోజనాలయ్యాక మేడమీద పడకలు పర్చుకున్నారు. సింధూర ఏవో పుస్తకాలు వెతుకుతూ తీసింది. పడకలు పర్చుకున్నారు. పుస్తకం మధ్య దొరికిన కాగితం విప్పింది. "వెలుతురు చీకటిని జయించే ప్రభాతవేళ మన కలల జలతారుని నీలిరంగు కాగితం కప్పుకుని కొండ చివరలనుండి జాలువారే మంచు క్రింద తడిచి తడిచి... ఆమె చప్పున ఉత్తరం క్రింద సంతకం చూసింది... రాఘవ.

"పావనీ' మేడమీదికొచ్చి చెల్లెల్ని పిలిచింది.

ఏంటక్కా?

"రాఘవ ఎవరు" సూటిగా అడిగింది.

పావనీ ఊహించనంత కలవరపడలేదు. అసలు ఆమె ఆ విషయం మాట్లాడటానికే అక్కని మరీ మరీ రమ్మని పోరుపెట్టింది.

"మా కాలేజీ, ఫైనల్ డిగ్రీ' నసిగింది.

"ప్రేమించుకున్నారా? అస్పష్టంగా తలూపింది పావనీ.

"నీ వయసెంత? చెల్లెల్ని దగ్గరిగా తీసుకుంటూ సింధూర ప్రశ్నించింది.

"పద్దెనిమిది" ప్రేమించడానికి సరైన వయస్సు సింధూర నవ్వింది.

ప్రేమంటే ఏమిటీ? ఏ ఉద్దేశ్యంతో అతనిని ప్రేమిచ్చావ్ అందంగా ఉంటాడు. బాగా మాట్లాడతాడు పసిపిల్లలా మాట్లాడకు, కొద్దిగా బాగుంది చక్కగా మాట్లాడితే అది ప్రేమవుతుందా? ఇన్‌ఫాచ్యుయేషన్ అవుతుంది కాని.

అక్క గొంతులోని కోపాన్ని పసిగట్టి పావని మరేం మాట్లాడలేదు.

సింధూర లాలనగా ముఖాన్ని చేతుల్లోకి తీసుకుంది.

ఆమె కళ్ళ నిండా బెదురు...

"పావనీ రెండు హృదయాలు శూన్యంలో స్పృశించుకోవడం ప్రేమంటే. కథల్లో, సినిమాల్లో, వున్నంత ఉన్నతంగా ఉండదు ఏ ప్రేమ కూడా!'

అయినా చదువుకునే కుర్రాడిని పెండ్లి చేసుకుని ఏం చేద్దామని?

ప్రేమ , కొరుక్కుతిని ఎన్నాళ్ళు బ్రతుకుదామని... చూడమ్మా ప్రేమ, స్నేహం లాంటివి ఆర్థిక పునాదిమీద లేచే గోడలు అలాంటి ట్రాప్‌లోకి జారకు."

నన్నిలా డిజప్పాయింట్ చేస్తావనుకోలేదక్కా!

ఇదేమాట అతడితో అనే అవసరం రాకుండా జాగ్రత, పడమంటున్నాను. అర్థం చేసుకో. అంతకుమించి తను చెప్పడానికి ఏమి లేనట్లు సింధూర గోడవైపు తిరిగి పడుకుంది.

ఆ రోజే సింధూర ప్రయాణం.

అక్కకి తోడుగా పావనీ కూడా స్టేషన్‌కొచ్చింది.

సింధూర కిటికీ పక్క సీట్లో కూర్చుంది. సింధూర చెల్లెల్ని దగ్గరగా పిలిచింది.

"తొందరపడి రాఘవ విషయంలో ఏ నిర్ణయానికి రాకు"

స్వేచ్ఛ అంటే బాధ్యత. ప్రేమ వివాహంలో ముందడుగే కాని వెనుకడుగు ఉండదు. అతడిని ఆర్థికంగా నిలదొక్కోనీ. అసలు మీ మధ్య ప్రేమ ఉందో లేక మీ పరిచయానికి అలా పేరు పెట్టుకుని గాబరాపడుతున్నారో తెలుసుకోండి. రెండు మూడు సంవత్సరాలు గడువిచ్చి చూడండి. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. అర్థం చేసుకోడానికి ఏకాంతాలూ, శారీరక స్పర్శలూ అక్కర్లేదు. ఒకరినొకరు గమనిస్తూ, వుంటే చాలు. వీటన్నింటికి మించి అతను నిన్ను ప్రేమిస్తున్నాడో నీ వయసుని ప్రేమిస్తున్నాడో తెలివిగా ఆలోచించుకో" చివరి వాక్యం అంటున్నప్పుడు సింధూర కళ్ళు చెమర్చాయి. క్షణంలో ఆమె సర్దుకూర్చుంది.

నీ బుగ్గమీద ఆ బ్యూటీస్పాట్ బావుందక్కా.

పిచ్చిపిల్లా నీకు ఈ బ్యూటీస్పాట్‌ల అవసరం రాదనుకుందాం! నీ భర్తకి సిగెరెట్లుతో కాల్చేంత సరదాలు ఉండవనే ఆశిద్దాం!! ఉండినా... అవి నీ శరీరాన్ని తచ్చాడవనే ఆశిద్దాం అనుకుంది లోపల సింధూర. అప్పుడే సింధూర చెంపమీదకి కన్నీటి చుక్క ఒకటి జారింది. చెల్లెలికి ముఖం కనిపించకుండా సీటు వెనక్కి చేరగిలబడింది.

బండి అప్పుడే కదిలింది...

ఐ. అంజనీదేవి